అసంపూర్తి.. అసంతృప్తి

ఎల్లారెడ్డిపేట: ముస్లిం మైనార్టీలు శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా మండల కేంద్రంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన షాదీఖాన ఇంకా అసంపూర్తిగానే మిగిలింది. లక్షల్లో నిధులు మంజూరైనా అసంపూర్తిగా నిర్మించి చేతులు దులుపుకున్నారు. మూడు ప్రభుత్వాలు మారినా షాదీఖాన అందుబాటులోకి రావడం లేదు.

- రూ.40 లక్షలతో షాదీఖానా నిర్మాణం
- రూ.7 లక్షల కోసం ఆగిన పనులు
- ఐదేళ్లుగా ఎదురుచూపు
- అందుబాటులోకి రాని వైనం


షాదీఖానా భవనం

రెండు దశాబ్దాలుగా..

షాదీఖాన నిర్మాణానికి 2002లో అప్పటి మంత్రి సుద్దాల దేవయ్య రూ.20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని మైనార్టీ పెద్దలు విరాళాలు జమ చేసి రూ.లక్షకు కొనుగోలు చేశారు. కాని నిర్మాణానికి నోచుకోలేదు. ఆ తర్వాత చాలా సంవత్సరాల తర్వాత షాదీఖాన తెరపైకి వచ్చింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత 2016లో అప్పటి ఎంపీపీ తోట ఆగయ్య షాదీఖాన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కేటీఆర్‌ను నిధుల మంజూరుకు హామీ ఇచ్చారు. గతంలో మంజూరైన రూ.20 లక్షలు కాకుండా, మరో రూ.20 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. కొనుగోలు చేసిన స్థలంలో రూ.40 లక్షలు వెచ్చించి షాదీఖాన నిర్మించారు. కాని ఇంకా పూర్తి చేయాల్సిన పనులకు మరో రూ.7 లక్షలు కావాల్సి ఉండగా, ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ఐదేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

మిగిలిన పనులు ఇవే..

రెండంతస్తుల షాదీఖాన భవన నిర్మాణాన్ని అన్ని హంగులతో పూర్తి చేసినా, ముఖ్యమైన ప్రహరీ, సెప్టిక్ ట్యాంక్, డ్రెయినేజీ నిర్మించలేదు. తాగునీటి కోసం బోరు వేయాల్సి ఉంది. ప్రధానంగా విద్యుత్ సౌకర్యం కల్పించాల్సి ఉంది. వీటికి అదనపు నిధులు అవసరం ఉంది.

పట్టించుకోని అధికారులు

ఐదేళ్లుగా అందుబాటులోకి రాకపోవడంతో మైనార్టీలు పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు జరుపుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. షాదీఖాన నిర్మాణానికి పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేయడంతో సకల సౌకర్యాలు సమాకురుతాయని భావించారు. అయితే నిర్మాణం పూర్తి చేయకపోవడంలో అధికారుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తున్నారు. మిగిలిన పనులను పూర్తిచేసి షాదీఖానాను అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.

అందుబాటులోకి తేవాలి



షాదీఖాన లేక పేద మైనార్టీలు బయటి ఫంక్షన్ హాళ్లలో పెళ్లిళ్లు చేయడం భారంగా మారింది. షాదీఖాన ఉంటే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.

– ఇంత్యాజ్, ఎల్లారెడ్డిపేట

అధికారులు స్పందించాలి



షాదీఖానాలో మిగిలిన పనులు పూర్తి చేయాలి. రూ.40 లక్షలతో నిర్మించిన భవనాన్ని నిర్లక్ష్యంగా వదిలివేయడం బాధాకరం. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌డి.షాజిత్,ఎల్లారెడ్డిపేట

అదనపు నిధులు కావాలి

మిగులు పనులకు ఇంకా నిధులు అవసరమున్నాయి. వాటిని పూర్తి చేసేందుకు రూ.7 లక్షలకు ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు పూర్తిచేసి అందుబాటులోకి తెస్తాం. నిధుల విడుదలకు కొంత జాప్యం జరిగింది.

– శ్రీనివాస్, పీఆర్, డీఈఈ, సిరిసిల్ల

క్లుప్తంగా

పాతబస్టాండ్ కాంప్లెక్స్ పరిశీలన


కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిరిసిల్లటౌన్: శిథిలమవుతున్న పాతబస్టాండు కాంప్లెక్స్‌ను బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి మంగళవారం పరిశీలించారు. కాంప్లెక్సు ప్రహరీ, చెత్తు పెచ్చులూడిపోతుందని, ఇది ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని, మరమ్మతు చేయాలని అర్బన్‌బ్యాంకు డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్ కోరారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కాంప్లెక్సు రిపేరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. కౌన్సిలర్ రాజిరెడ్డి, నాయకులు అడ్డగట్ల మురళి, ఎండీ అజ్మత్, దేవదాసు, తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ ధర్నా


ఆందోళన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఉమ్మడి మండల ప్రజల చిరకాల ఆకాంక్ష ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్‌కుమార్, మల్లారపు ప్రశాంత్ అన్నారు. డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేసి తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎల్లారెడ్డిపేటలో డిగ్రీ కళాశాల లేక ఇంటర్ విద్యను పూర్తిచేసుకున్న నిరుపేద విద్యార్థులు ప్రవేట్ కళాశాలల్లో చదివే ఆర్థిక స్తోమత లేక ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. కళాశాల ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కళాశాల ఏర్పాటు చేసేంత వరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మనోజ్‌కుమార్, రాకేశ్, కల్యాణ్‌కుమార్, అదిత్య, అనిల్, జశ్వంత్, దినేశ్, వెన్నెల పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మనోహర్‌రెడ్డి


మంత్రి కేటీఆర్‌ను కలిసిన మనోహర్‌రెడ్డి

వేములవాడఅర్బన్: వేములవాడ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను మంగళవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

ప్రారంభోత్సవాలకు రావాలని కేటీఆర్‌కు ఆహ్వానం


మంత్రి కేటీఆర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు

వేములవాడ: వేములవాడలో చేపట్టే పలు అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు రావాలని మంత్రి కేటీఆర్‌ను కోరినట్లు ఎమ్మెల్యే రమేశ్‌బాబు మంగళవారం తెలిపారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరినట్లు చెప్పారు. అనంతరం రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియమితులైన ప్రొఫెసర్ లింబాద్రిని ఎమ్మెల్యే కలిసి అభినందనలు తెలిపారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న పోస్టల్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్

వీర్నపల్లి: మండల కేంద్రంలో పోస్టల్ శాఖ ద్వారా ప్రవేశపెట్టిన బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సిరిసిల్ల పోస్టల్ బ్యాంక్ మేనేజర్ రాజేందర్ అన్నారు. మండల కేంద్రంలో పోస్టల్ ప్రమాద బీమాపై మంగళవారం అవగాహన కల్పించారు. పోస్టాఫీస్ ఖాతాతో రూ.369 చెల్లిస్తే రూ.10 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని సూచించారు. ప్రజలు పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీపీఎం మల్లేశం, రాములు, యాకోబు, పురుషోత్తం పాల్గొన్నారు.

చెక్ పోస్టులు ఏర్పాటు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చందుర్తి: వేములవాడ-కోరుట్ల ప్రధాన రహదారిలో మండలంలోని మర్రిగడ్డ గ్రామ శివారులో మంగళవారం పోలీసులు చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆవులను తరలించకుండా ఉండేందుకు పోలీసు ఉన్నతాధికారుల అదేశాల మేరకు ప్రధాన రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డుపై వెళుతున్న గూడ్స్ వాహనాలను పోలీసులు క్షుణంగా పరిశీలించి వదిలేస్తున్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే వైద్య శిబిరాలు

- చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు


మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకే వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చల్మెడ ఆనందరావు వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహరావు తెలిపారు. మండలంలోని రామన్నపేటలో జిల్లా వికాస తరంగిణి ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. మండలంలో 16 శిబిరాలు ఏర్పాటు చేశామని, ఎక్కువగా థైరాయిడ్ కేసులు వచ్చాయన్నారు. ప్రస్తుతం క్యాన్సర్ వ్యాధి ప్రబలుతుందని ఈ వ్యాధిని గుర్తించేందుకే క్యాన్సర్ నిర్ధారణ, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శిబిరాల్లో గుర్తించిన వారికి ఉచితంగా వైద్య సేవలు, ఆపరేషన్లు చేస్తుండగా, కొంతమంది విమర్శిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. నాలుగైదేళ్ల నుంచి నిర్వహిస్తున్న శిబిరాలను ఎందుకు విమర్శిస్తున్నారో ప్రజలు తెలుసుకుంటారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సంతోష్, ఎంపీటీసీ మల్లేశ్, నాయకులు ముష్కం జీవన్‌గౌడ్, దుర్గం మహేశ్, కాసర్ల రాజు, ఆరె మహేందర్, క్యాంప్ ఇన్‌చార్జి శ్రీనివాసరావు, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

మహాజన్ సంపర్క్ అభియాన్


తంగళ్లపల్లి: ఇందిరమ్మకాలనీలో ప్రచారం

తంగళ్లపల్లి: మండలంలోని ఇందిరమ్మకాలనీలో మంగళవారం బీజేపీ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటి బీజేపీ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, వేముల కిషన్ పాల్గొన్నారు.

సిరిసిల్లటౌన్: మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా ప్రధాని మోదీ ప్రసంగాన్ని సిరిసిల్ల శివనగర్ ఆలయంలో లైవ్‌లో పార్టీ నేతలు వీక్షించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆడెపు రవీందర్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, కౌన్సిలర్ గూడూరి భాస్కర్, శీలం రాజు, శిరస్వాల్ కైలాశ్, నరేశ్ పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంలో నిర్వహించిన బూత్ సబ్‌సే మజ్‌బూత్ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, బాలాజీ, జింక వెంకటి, జింక వెంకటి, ఎంపీటీసీ రేణుక, తిరుపతి, ముష్కం శ్రీనివాస్, వెంకటి పాల్గొన్నారు.

రోమాల లక్ష్మణ్‌కు నివాళి


నివాళి అర్పిస్తున్న నాయకులు

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని నూకలమర్రి గ్రామానికి చెందిన ఉద్యమాల వీరుడు రోమాల లక్ష్మణ్ 18వ వర్ధంతిని గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పేరుపై ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేశారు. అనంతరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జ్ఞాపిక, ఆర్థికసాయాన్ని రోమాల ప్రవీణ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గొస్కుల రవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గడ్డం హన్మాండ్లు, సర్పంచ్ పెండ్యాల తిరుపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్, బొడ్డు రాములు, సోమినేని బాలు, ఎంపీటీసీ తిరుపతి, దొంతుల అంజనీకుమార్, ఈర్యానాయక్, ప్రభాకర్, ఎడపెల్లి మహేష్, విష్ణు, కమలాకర్, స్వామి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణ అందరి బాధ్యత


నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీటీసీ, అధికారులు

ఎల్లారెడ్డిపేట: మొక్కలను నాటి వాటిని సంరక్షించడం అధికారులతో పాటు అందరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో ఉన్న నర్సరీని మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. మొక్కల పెంపకంపై నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలను కాపాడే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అదే విధంగా నర్సరీలో ఉన్న మొక్కలను ఇంటింటికీ చేరవేయాలని, వాటిని సంరక్షించే బాధ్యత ఇంటి యాజమానులకు తెలపాలన్నారు. ప్రతి గ్రామానికి రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, ఏపీవో కొమురయ్య, కార్యదర్శి సంపత్ పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు పండుగ సామగ్రి అందజేత


సరుకులు అందిస్తున్న వెంకటేశ్వర్‌రావు

ముస్తాబాద్: తొలి ఏకాదశి పండగ సందర్భంగా పది పేద కుటుంబాలకు చిట్నేని వెంకటేశ్వర్‌రావు, మాధవి దంపతులు నిత్యావసర సరుకులను మంగళవారం అందించారు. ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కొమ్మటి రాజమల్లు సూచన మేరకు వారికి వంట నూనె, పప్పు, బియ్యం, పిండి, చక్కెర తదితర సరుకులను అందించారు.

పాఠశాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ప్రారంభం


బస్సును ప్రారంభిస్తున్న సర్పంచ్ వజ్రమ్మ

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిర గ్రామం నుంచి వీర్నపల్లి మోడల్ పాఠశాల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సును మంగళవారం సర్పంచ్ కుంబాల వజ్రమ్మ ప్రారంభించారు. పదిర నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా దుమాల, అల్మాస్‌పూర్, కంచర్ల నుంచి వీర్నపల్లి వరకు ప్రతిరోజు విద్యార్థుల పాఠశాల సమయానికి ఈ బస్సును నడిపిస్తారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ బస్సు ప్రారంభంతో ఇన్నాళ్ల విద్యార్థుల కష్టాలు తీరాయన్నారు. అకాడమిక్ ఇయర్ వరకు బస్సును నడిపిస్తామని డీఎం మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా డీఎంకు సర్పంచ్‌తో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. మొదటి రోజు బస్సులో ప్రయాణించే విద్యార్థులందరరికీ మాజీ సెస్ డైరెక్టర్ కుంబాల మల్లారెడ్డి రూ.5 వేలు వెచ్చించి బస్సు టికెట్లు తీసుకున్నారు. ఫ్రీ బస్సు పాసుల కోసం సర్పంచ్ రూ.5 వేల విరాళం అందించారు.

క్విజ్ పోటీల విజేతలకు బహుమతులు



వేములవాడరూరల్, కోనరావుపేటలో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా ఆర్‌బీఐ ఆదేశాల మేరకు మండల కేంద్రాల్లో నిర్వహించిన ఫైనాన్స్ లిట్రసీ క్విజ్‌లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద రూ.5 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన వారు జిల్లా స్థాయికి అర్హత సాధించారు.

వేములవాడరూరల్: అర్బన్ మండలంలోని కేజీబీవీ విద్యార్థి బి.అక్షిత, జి.అనూష, వేములవాడ తెలంగాణ గురుకుల పాఠశాలకు చెందిన ఎం.హారిక, జె.స్పందన, వేములవాడ అర్బన్ మండలం మారుపాక ప్రభుత్వ పాఠశాలకు చెందిన భావన, పవిత్రకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను యూనియన్ బ్యాంకు అధికారులు ప్రకాశ్, లావణ్య, మండల నోడల్ ఆఫీసర్ మధుకర్, ఎగ్జామినర్ అంజయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ఆకుల శ్రీనివాస్, నగేశ్, జయ, రాజు, సతీశ్, ఎల్లేశ్ పాల్గొన్నారు.

రుద్రంగి: మండలంలోని మానాల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎస్ లావణ్య, ఏ మనూష ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారు. రుద్రంగి వైస్‌ఎంపీపీ పీసరి చిన్న భూమయ్య, పాఠశాల హెచ్‌ఎం మోహన్, ఉపాధ్యాయబృందం అభినందించారు.

కోనరావుపేట: మండలానికి చెందిన డి. వైష్ణవి(10 తరగతి), అశ్విత ప్రథమ స్థాయిలో నిలిచారు. హెచ్‌ఎం పులి రాజుగౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని దుమాల ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య మొదటి స్థానం, అభిషేక్ రెండవ స్థానం వెంకటాపూర్ పాఠశాలకు చెందిన శ్రీనిధి రేఖాశ్రీ, రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన నాగవర్షిణి, సంజన మూడో స్థానంలో సాధించారు. విద్యాశాఖ నోడల్ అధికారి రవి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, స్వామి, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రావణ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డిపేటలో..

బోయినపల్లి: స్థానిక మోడల్ స్కూల్, కొదురుపాక హైస్కూల్, విలాసాగర్ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ మహేందర్, జిల్లా బ్యాంక్ అధికారి హరీశ్, ఎంఈఓ శ్రీనివాసదీక్షిత్, హెడ్‌మాస్టర్ ఎం. ప్రేమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు వైష్ణవి, అక్షయ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయిలో నిర్వహించనున్న పోటీలకు అర్హత సాధించారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ రమేశ్, శిక్షణ ఉపాధ్యాయిని రేణుక, విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు అభినందించారు.

కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని, బూత్ స్థాయి నుంచి మండల స్థాయిలో కమిటీలను పటిష్టం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో యువకులను చేర్చుకుంటూ ఇతర పార్టీల నుంచి వచ్చే వారికి అవకాశం కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వంగ గిరిధర్‌రెడ్డి, నాయకులు సద్ది లక్ష్మారెడ్డి, సాహెబ్, దేవయ్య, శ్రీనివాస్, పర్శరాములు, తిరుపతిరెడ్డి, బుచ్చాగౌడ్, బాబు, పోచయ్య, రాజేందర్, రవి, రమేశ్ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే సహకార లక్ష్యం


చెక్కులు పంపిణీ చేస్తున్న చైర్మన్ కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రాథమిక సహకార సంఘం పనిచేస్తోందని సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ఏడుగురు రైతులకు రూ.20.50 లక్షల చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున రుణాలను అందిస్తున్నట్లు తెలిపారు. డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్లపెంపకం లాంటి వాటిపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ జంగిటి సత్తయ్య, డైరెక్టర్లు వెంకట నర్సింహరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రక్తదాన శిబిరం



వేములవాడ అర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత రక్తదాన శిబిరం నిర్వహించినట్లు డిపో మేనేజర్ మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వేములవాడ ఆర్టీసీ డిపోలోని 20 మంది ఉద్యోగులు రక్తదానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపర్‌వైజర్ నారాయణ, సత్యనారాయణ, నరహరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముస్తాబాద్ ఏపీఎంగా దేవరాజు

ముస్తాబాద్: ముస్తాబాద్ ఐకేపీ ఏపీఎంగా దేవరాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ముస్తాబాద్ ఏపీఎంగా నాలుగేళ్లు పనిచేసిన జయసుధ డీఆర్‌డీవోకు బదిలీ అయ్యారు. కోనరావుపేట ఏపీఎంగా పనిచేస్తున్న దేవరాజు ముస్తాబాద్‌కు బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన దేవరాజుకు సీసీలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయాలి

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామపంచాయతీ ఒక కుల సంఘ భవనంలో కొనసాగుతోంది. కొత్త గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. వెంటనే నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చెరువు కట్ట హద్దులు తొలగించిన రియల్టర్లు

బోయినపల్లి: బోయినపల్లి తూర్పు చెరువు కట్ట హద్దు రాళ్లను తొలగించి కబ్జా చేసిన రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ సంబ లక్ష్మీరాజం మంగళవారం తహసీల్దార్ దర్శెల్లి నరేశ్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నెంబర్ 20లో చెరువు కట్ట పరిసరాల్లో రియల్ వ్యాపారులు భూమి కొనుగోలు చేశారని, చెరువు పాత హద్దులను తొలగించడంతో పాటు, చెరువు కట్టపైకి చొరబడి హద్దు రాళ్ల పాతారని పేర్కొన్నారు. వీరి చర్యలు తీసుకుని చెరువు భూమిని కాపాడాలని ఫిర్యాదులో కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలంలోని చీకోడులో బాధిత కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బానుక నాగరాజు, మాజీ సర్పంచ్ కాంపెల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీలు లక్ష్మణ్, అంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల కుటుంబాలకు రూ.20 లక్షల బీమా

వేములవాడ: వేములవాడ జర్నలిస్టుల కుటుంబాలకు రూ.20 లక్షల బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రముఖ ఎన్‌ఆర్‌ఐ తోట రామ్‌కుమార్ ప్రకటించారు. టీఆర్‌కే ట్రస్టు కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. జర్నలిస్టుల కష్టసుఖాల్లో తప్పకుండా తన భాగస్వామ్యం ఉంటుందన్నారు. జర్నలిస్టుల నివేశన స్థలాల్లో బోరు వేయిస్తామని ప్రకటించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ లాయక్‌పాష, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ లాయక్ పాష, వేములవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొలిపాక నర్సయ్య, ఉపాధ్యక్షుడు రేగుల రాంప్రసాద్, అజీం, ప్రధాన కార్యదర్శి జితేందర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

వీర్నపల్లి: మండలంలోని బాబాయి చెరువు తండా, గర్జనపల్లి, భూక్య తండా, మద్దిమల్ల తండా, లాల్ సింగ్ తండా గ్రామాల్లో 2020 నుంచి 2023 వరకు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ మంగళవారం నిర్వహించారు. గ్రామ సభలో ఆయా గ్రామాల్లో జరిగిన వివరాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, ఏపీవో శ్రీహరి, సర్పంచులు టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.